పఠనాసక్తి పెంపే ప్రాతిపదికగా

- మారిన 'పది' పరీక్ష తీరు
- రెండు పేపర్ల విధానం రద్దు
- 11 నుంచి 6 పేపర్లకు కుదింపు
- ఇంటర్నల్, బిట్ పేపర్ పద్ధతికి స్వస్తి
- ఒక్కో సబ్జెక్టుకు వంద మార్కులు
- గ్రేడ్ పాయింట్లు తొలగింపు
- పాత విధానంలో మార్కులు కేటాయింపు



పదో తరగతి విద్యార్థులు (ఫైల్)

బాపట్ల అర్బన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల విధానంలో సమూల మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కొత్త విద్యా విధానానికి నాంది పలికింది. బాపట్ల జిల్లాలో 334 పాఠశాలల్లో సుమారు 1,734 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. పరీక్షలను పాత పద్ధతిలో కాకుండా కొత్త విధానంలో నిర్వహించనున్నారు. బాపట్ల జిల్లా మొత్తం 103 పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి విద్యార్థులు రెగ్యులర్ 16,754 మంది, సప్లిమెంటరీ 590 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. ప్రభుత్వం చేపట్టిన నూతన పరీక్ష విధానంతో విద్యార్థులకు ఎంతో లబ్ధి చేకూరనుంది. ఇంటర్నల్ మార్కులు, బిట్‌పేపర్ విధానాన్నీ తొలగించి విద్యార్థుల్లో పఠానాసక్తిని పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు, ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి.

ఒకే పేపర్ విధానం

గతంలో పేపర్ 1, పేపర్ 2 పద్ధతిలో పరీక్షలు నిర్వహించేవారు. ఆరు సబ్జెక్టులకు 11 పేపర్లు రాయాల్సి వచ్చేది. రెండుసార్లు ఒకే సబ్జెక్టుకు సంబంధించి పరీక్ష రాయడానికి విద్యార్థులు పడుతున్న అవస్థలను గుర్తించిన ప్రభుత్వం మార్పునకు శ్రీకారం చుట్టింది. ఫలితంగా ఇప్పుడు ఒక సబ్జెక్టుకు ఒక పేపర్‌నే వంద మార్కులకు ఇవ్వనున్నారు. ఆరు పేపర్లే 600 మార్కులకు ఉండనున్నాయి. ఈ పద్ధతి వల్ల విద్యార్థులపై ఉన్న అధిక భారం తగ్గి పఠనాసక్తి పెరగనుంది.

ఇంటర్నల్, బిట్ పేపర్ విధానానికి స్వస్తి

గతంలో ఇంటర్నల్, బిట్ పేపర్ విధానాలతో అదనపు మార్కులను జోడించేవారు. ప్రస్తుతం ఇంటర్నల్ మార్కులను పూర్తిగా తొలగించారు. అలాగే ప్రత్యేకంగా 30 మార్కులకు ఉన్న బిట్ పేపర్‌ను రద్దు చేశారు.

గ్రేడ్ పాయింట్లు తొలగింపు

గ్రేడ్ పాయింట్ల విధానానికీ ప్రభుత్వం ముగింపు పలికింది. గ్రేడ్ పాయింట్ల వల్ల విద్యార్థులకు ఉన్నత చదువుల్లో తీవ్ర ఇబ్బందులు నెలకొంటున్నాయన్న విమర్శలు ఉన్నాయి. ఇటీవల ట్రిపుల్ ఐటీ కళాశాలల్లో గ్రేడ్ల ఆధారంగా సీట్ల కేటాయింపునకు అధికారులు అవస్థలు పడ్డారు.

పరీక్ష సమయం పెంపు

గతంలో ఉన్న పరీక్ష సమయాన్ని ప్రభుత్వం మార్పు చేసింది. ఈ సమయం గతంలో మూడు గంటలు ఉండేది. అయితే అదనంగా 15 నిమిషాల వ్యవధిని ఈ ఏడాది నుంచి పెంచారు. ఈ 15 నిమిషాల్లో రాసిన సమాధానాలను మరోసారి సరిచూసుకోవడానికి కేటాయిస్తే విద్యార్థులకు సౌలభ్యంగా ఉంటుంది.

ప్రశ్నాపత్రాలు ఇలా

- తెలుగులో పద్యభాగంలో ప్రతిపదార్థాలు, చిన్న ప్రశ్నలు, వ్యాస రూప ప్రశ్నలు ఉంటాయి.
- హిందీలో ఒక మార్కు పేరాగ్రాఫ్ ద్వారానే ప్రశ్నలు లేక వ్యాస రూప ప్రశ్నలు ఉంటాయి
- ఇంగ్లిషులో పేరాగ్రాఫ్ ప్రశ్నలు గ్రామర్ క్రియేటివిటీ రైటింగ్స్ ఉంటాయి
- సామాన్య శాస్త్రం మినహా అన్ని సబ్జెక్టులకు ఒకటే ప్రశ్నపత్రం ఉంటుంది
- సామాన్య శాస్త్రంలో భౌతిక రసాయన శాస్త్రాలు ఒక విభాగం జీవశాస్త్రం పేపర్లను పార్ట్–ఏ, పార్ట్–బీగా చేసి ఒక పార్ట్‌కు 50 మార్కుల చొప్పున ప్రశ్న పత్రాలు ఇవ్వనున్నారు.
- గణిత శాస్త్రంలో గ్రాపులు, సైన్స్‌లో బొమ్మలు గీయడం, సోషల్‌లో రెండు మ్యాప్‌లు (ఇండియా, వరల్డ్) ఉండనున్నాయి.
- మొత్తంగా నాలుగు సెక్షన్లుగా 33 ప్రశ్నలకు 100 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది
- సెక్షన్ ఏలో ఒక మార్కు సూక్ష్మ లఘు ప్రశ్నలకు 12 మార్కులు కేటాయిస్తారు
- సెక్షన్ బీ లో రెండు మార్కుల తేలికైన ప్రశ్నలు 8 ఉంటాయి
- సెక్షన్ సీలో నాలుగు మార్కుల లఘు ప్రశ్నలు ఎనిమిది ఉంటాయి
- సెక్షన్ డీలో 8 మార్కుల వ్యాస రూప ప్రశ్నలు 5 ఉంటాయి.

పరీక్షల విధానం మారింది



బోధన ఆధారంగా పరీక్షల్లో ప్రభుత్వం మార్పులు చేపట్టింది. ఈ మార్పులతో విద్యార్థుల అభ్యసనా పద్ధతిలో మార్పులు వచ్చే అవకాశం ఉంది. బిట్ పేపర్‌ను రద్దుచేసి విద్యార్థులకు అదనపు సమయాన్ని ఇవ్వడం హర్షణీయం. గ్రేడ్ల పద్ధతిని రద్దుచేసి మార్కులు కేటాయించడం వల్ల ర్యాంకులు తెలుసుకోవచ్చు. ఇంటర్నల్ మార్కుల రద్దుతో విద్యార్థులలో పఠానాసక్తిని పెంచవచ్చు.

– పి.వి.జి.రామారావు, జిల్లా విద్యాశాఖ అధికారి, బాపట్ల

క్లుప్తంగా

నమో బండ్లమ్మ



చందోలు(పిట్టలవానిపాలెం): చందోలులోని బగళాముఖి బండ్లమ్మ అమ్మవారి ఆలయంలో ఫాల్గుణ మాసం చివరి ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి కొబ్బరి కాయలు కొట్టి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు మాట్లాడుతూ మాఘ మాసం ఆదివారం కావడంతో ప్రత్యేక పూజలు నిర్వహించినట్టు వెల్లడించారు. ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

ఉపాధి కల్పన ఎంతో మేలు



బాపట్ల: పేదలకు ఉపాధి కల్పించడం ఎంతో మేలని ఎస్ టు నీడ్స్ ఫౌండేషన్ కార్యదర్శి రమ్యాపావని తోట పేర్కొన్నారు. బాపట్ల మండలంలోని విజయలక్ష్మీపురంలో పేద మహిళలకు కుట్టుమిషన్ నేర్పించటంతోపాటు వారికి ఉపాధి కల్పించటం ఎంతో సంతోషంగా ఉందని ఆమె వెల్లడించారు. ఆదివారం మాచవరం స్వప్నకు కుట్టు మిషన్‌ను ఆమె అందించారు. కార్యక్రమంలో కుండేటి శివకుమారి, గుండుబోయిన లక్ష్మీ, దీపికా, తోట సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



బాపట్ల అర్బన్: సమాజంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కమ్మ జన సేవా సమితి పనిచేస్తోందని సమితి అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు చెప్పారు. ఆదివారం స్థానిక కమ్మ జన సేవా సమితి కల్యాణ మండపంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ నిర్వహణలో జరిగిన ఈ శిబిరంలో డాక్టర్ దృశ్య, డాక్టర్ మేఘన కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి పెదకాకాని శంకర నేత్రాలయంలో శుక్లాల ఆపరేషన్లు చేస్తారని క్యాంప్ ఇన్‌చార్జి నాగబాబు తెలిపారు. మొత్తం 300 మంది ఈ శిబిరంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సమితి కార్యదర్శి రామినేని వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శి కొల్లా శ్రీనివాసరావు, కోశాధికారి ఇ.హరిబాబు, మానం భద్రయ్య, కారుమంచి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



పేరలి(కర్లపాలెం): ఆపదలో ఉన్న వారికి ఆర్థిక సాయం అందించటం అభినందనీయమని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కాగిత బుల్లియ్య చెప్పారు. పేరలి పంచాయతీ పడమర యాదవపాలెంకు చెందిన పిన్నిబోయిన చెంచమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. చెంచమ్మ భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించేందుకు మట్టి ఖర్చులకు ఆదివారం పేరలి నరసయ్య మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు, ప్రముఖ నేత్ర వైద్యులు పేరలి బాలకృష్ణమూర్తి ఆర్థిక సహకారంతో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కాగిత బుల్లియ్య , ట్రస్ట్ కార్యదర్శి శ్రీనివాసరావు చెంచమ్మ కుటుంబ సభ్యులకు రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గొర్రు ముచ్చు మీరయ్య, మద్దిబోయిన శివరావు, గేరా ఏసుబాబు, షేక్ సుభానీ, మల్లెల పాలు, నాదెండ్ల బాబూరావు, కర్రి ముక్కంటి, కాటూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీతపై ప్రచారం

ఈపూరు : ఉగాది పండగను పురస్కరించుకొని మండలంలోని భద్రుపాలెం, బొమ్మరాజుపల్లి, కూచనపల్లి గ్రామాల్లో త్రైతసిద్ధాంతం – ప్రబోధసేవాసమితి హిందూ జ్ఞానవేదికకు చెందిన చిలకలూరిపేట కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత, మన పండుగలు, సంప్రదాయాలు గ్రంథాల ప్రచారం జరిగింది. త్రిమత ఏకైక గురువు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల రాసిన ఆధ్యాత్మిక 100 రకాల త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రజలకు వివరించారు. ఉగాది అంటే యుగానికి ఆది అని, దేవుని చేత ఆది సృష్టి ఏర్పడింది కాబట్టి తొలి పండగ ఉగాది అని తెలిపారు. ఆరు గుణాలకు ప్రతీకగా షడ్రుచుల ప్రసాదాన్ని తయారు చేసి దైవం ముందర ఉంచి తమలోని ఆరు గుణముల మాయను తీసివేసి మోక్షానికి దగ్గర చేయమని ప్రార్థించే వారని సభ్యులు తెలిపారు.

ఉగాది అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి



ఉగాది పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: ఉగాది అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. అర్చక సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శోభకృత్ నామ సంవత్సర పంచాంగ ఆవిష్కరణ నిర్వహించారు. ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ తెలుగు ప్రజలకు ఎంతో ముఖ్యమైన తెలుగు సంవత్సరాది అందరికీ శుభాలు కల్పించాలని కోరుకున్నారు. కార్యక్రమంలో అర్చక సేవా సంఘం సభ్యులు నల్లూరు పాంచజన్యం, స్వర్ణ రాఘవ శర్మ, బృందావనం గోపిచంద్, పరాశరం రమేష్,వినుకొండ సత్యం బాబు, రామభార్గవ,విఖనసమూర్తి, నెమలికంటి హనుమంతరావు, కొలను మోహన్‌అనంతచక్రవర్తి, అమంచి దత్తు, బృందావనం శ్రీనుబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

22న ఉగాది వేడుకలు

రేపల్లె: మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని గుత్తికొండ లక్ష్మీనారాయణ కల్యాణ మండపంలో ఈనెల 22న బుధవారం సాయంత్రం 5.30 గంటలకు ఉగాది సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఎంసీఏ మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ వేజళ్ల ప్రకాశరావు తెలిపారు. వేదాంతం భవాని రామలింగశాస్త్రి నిర్వహణలో వేదాంతం కూచిపూడి కళాపరిషత్ విద్యార్థినులతో కూచిపూడి నృత్యప్రదర్శన, పంచాగకర్త కవుతా సత్యవెంకట నాగరాజేష్‌తో పంచాంగ శ్రవణం నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

విద్యార్థులు బాగా చదవాలి



బాలుర హాస్టల్ వార్షికోత్సవంలో మాట్లాడుతున్న స్వామి స్థైర్యానంద సరస్వతి

బాపట్ల: విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఆశ్రమ నిర్వాహకులు స్వామి స్థైర్యానంద సరస్వతి పేర్కొన్నారు. బాపట్ల మండలంలోని విజయలక్ష్మీపురంలో స్వామి దయానంద సరస్వతి స్థాపించిన ఉచిత బాలుర హాస్టల్ వార్షికోత్సవం ఆదివారం జరిగింది. కార్యక్రమంలో స్వామి స్థైర్యానంద సరస్వతి మాట్లాడుతూ విద్యార్థులు అందరూ క్రమశిక్షణతో చదువుకుని సంస్కృతిసంప్రదాయాలను కాపాడాలని చెప్పారు. వేటపాలెం రాఘవేంద్రస్వామీజీ మాట్లాడుతూ బాలల నుంచే విలువలతో కూడిన విద్య వస్తోందని సూచించారు. విన్నకోట సత్యప్రసాద్, మామిడి రాజశేఖర్, వార్డెన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

• కేదారేశ్వరా.. ప్రణామం



ప్రత్యేక అలంకరణలో ఉన్న శివపార్వతుల ఉత్సవ విగ్రహాలు

కర్లపాలెం మండలం అగ్రహారం గ్రామంలోని గంగాగౌరీ సమేత బదరీ కేదారేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం శివపార్వతుల శాంతి కల్యాణం కనుల పండువగా జరిగింది. కల్యాణోత్సవంలో భాగంగా శివాలయంలో ఉదయం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వేద పండితులు శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఉంచి పలు రకాల పూలమాలలతో అలంకరించారు. అనంతరం శివమారుతిశర్మ గాయత్రీ దంపతులచేత లోక కల్యాణం కోసం శాస్త్రోక్తంగా శివపార్వతుల శాంతి కల్యాణ మహోత్సవం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో వాసుదేవ శాస్త్రి, సూర్య ప్రసాద్ శాస్త్రి, భక్తులు పాల్గొన్నారు. – కర్లపాలెం

తిరునాళ్లు సజావుగా జరిగేలా సహకరించాలి

కావల్యాపురం: ఉగాది పర్వదినం సందర్భంగా ఈనెల 22న బొందిలిపాలెం గ్రామంలో జరిగే అడవి పేరంటాళ్ళమ్మ తిరునాళ్లకు భక్తులు సహకరించాలని నిర్వాహకులు కోరారు. అమ్మవారి దేవాలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి సన్నిధిలో వివిధ గ్రామాల భక్తులు పొంగుళ్ళు పొంగించి తమ మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి దేవాలయం చుట్టూ పశువులు, జీవాలతో ప్రదక్షిణలు చేయించారు. తిరునాళ్లకు కమిటీ చైర్మన్, కమిటీ సభ్యుల సహకారంతో బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షణ చేస్తున్నట్లు ఎస్సై గల్లా రవికృష్ణ తెలిపారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకుపోదాం

ఎమ్మెల్యే కోన రఘుపతి



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: ప్రజారంజక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకుపోయేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. బాపట్ల పట్టణంలోని 12వ వార్డు పరిధిలో వెంగళవిహారలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే కోన ఇంటింటికీ వెళ్ళి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ మూడేళ్లలో ప్రతి గడపా పొందిన లబ్ధిని గురించి చెప్పారు. తమకు అందుతున్న పథకాలతో ఆనందంగా ఉన్నామని ఎమ్మెల్యే కోన రఘుపతి ఎదుట ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. బాపట్ల పట్టణాభివృద్ధికి సహకారం అందించిన వారందరికీ కోన రఘుపతి కృతజ్ఞతలు తెలిపారు. తొలుత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కాగిత యజ్ఞయ్య, పార్టీ మండల అధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, చేజర్ల నారాయణరెడ్డి, ఇనగలూరి మాల్యాద్రి, సోముల రాజశేఖర్‌రెడ్డి, ఆట్లప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

అధిక లోడుతో వెళ్తున్న లారీల పట్టివేత

ఈపూరు: అధిక లోడు, సరైన పత్రాలు లేనందున గ్రానైట్ లోడుతో ఉన్న ఐదు లారీలను విజిలెన్స్ అధికారులు పట్టుకొని ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మార్టూరు నుంచి మహారాష్ట్రకు వెళ్తున్న అధికలోడు, సంబంధిత సరైన పత్రాలు లేని గ్రానైట్ లోడు లారీలను మండల పరిధిలోని అంగలూరు వద్ద విజిలెన్స్ అధికారులు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ విప్పర్ల వెంకట్రావు తెలిపారు.

• 'ఉండ్రాళ్లయ్యా'.. దండాలయ్యా

లక్ష ఉండ్రాళ్ల నివేదన



భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలో కొలువైన సిద్ధిబుద్ధి సమేత గణపతిస్వామి దేవస్థానంలో ఆదివారం స్వామికి లక్ష ఉండ్రాళ్ల నివేదన శాస్త్రయుక్తంగా నిర్వహించారు. పంచాయతన ఆలయాలుగా ప్రసిద్ధి చెందిన గణపతి స్వామి, ఆది కామకామేశ్వరి, రామేశ్వరస్వామి, ఆదిశేషాచల స్వామి దేవస్థానాల్లో పంచామృత అభిషేకాలు జరిపారు. గణపతి స్వామికి 10 సార్లు రుద్రాభిషేకం చేశారు. ఉండ్రాళ్లను నివేదించారు. ఆలయ ప్రధాన అర్చకులు క్రోవి వెంకట శ్రీరామచంద్ర మూర్తి ఆధ్వర్యంలో అర్చక బృందం పూజలు చేసింది. భక్తులకు స్వామికి నివేదించిన ఉండ్రాళ్లను వితరణ చేసింది. ఇదిలా ఉంటే గణపతి స్వామికి భట్టిప్రోలుకు చెందిన పెనుమర్తి వెంకట అనంత పద్మనాభ శర్మ–మీనాక్షి దంపతులు రూ.1.40 లక్షల విలువైన రెండు కిలోల వెండి కిరీటాలను అందజేశారు. ఆలయ అర్చకులు శ్రీరామచంద్రమూర్తి ప్రత్యేక పూజలు చేశారు. – వెల్లటూరు(భట్టిప్రోలు)

వైభవంగా పోతురాజు స్వామి తిరునాళ్ల



పోతురాజు స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ

చెరుకుపల్లి: మండలంలోని తూర్పుపాలెం పంచాయతీ ఆవలవారిపాలెంలోని మాలక్ష్మమ్మ నూకాలమ్మ పోతురాజు చల్లలమ్మ, పోతురాజు స్వామి తిరునాళ్ల ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామిని, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిని అమ్మవార్లను దర్శించుకుని మొక్కుబడులు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ ప్రభ, డప్పు కళాకారుల విన్యాసాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పూషడపు పోతయ్య, లక్ష్మీగోవర్ధనమ్మ, గండే గోపాలరావు గౌతమీదేవి, భక్తులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాలను వినియోగించుకోవాలి



శిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నిజాంపట్నం: తీరప్రాంతంలోని ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో కృష్ణ నర్సింగ్ హోమ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం మంచి పరిణామమని ఎంపీ మోపిదేవి సోదరుడు మోపిదేవి హరనాథబాబు తెలిపారు. ఎంపీ మోపిదేవి రమణరావు సహకారంతో కృష్ణ నర్సింగ్ హోం ఆధ్వర్యంలో ఆదివారం నిజాంపట్నంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించి హరనాథబాబు మాట్లాడారు. వైద్య శిబిరాల నిర్వహణ అభినందనీయమని పేర్కొన్నారు. కంటిచూపు నిపుణులు డాక్టర్ హిమబిందు, ఎముకల స్పెషలిస్ట్ (ఆర్థోపెడిక్) డాక్టర్ దినేష్ రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, మోపిదేవి శ్రీనివాసరావు, మోపిదేవి ఆదిశేషు, ఎంపీటీసీ నాజర్‌ఖాన్, మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లెళ్లమూడి అమ్మ సందేశం అజరామరం



జిల్లెళ్ళమూడి అమ్మవారి శతజయంతి ఉత్సవాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన

బాపట్ల: అమ్మ సందేశం అజరామరమని, ఆ సందేశమే శిరోధార్యమని వక్తలందరూ కొనియాడారు. స్థానిక రోటరీ కల్యాణ మండపంలో జరిగిన జిల్లెళ్లమూడి అమ్మ శత జయంతి సందేశ సభ ఆదివారం ఆహ్లాదకరంగా జరిగింది. లక్కరాజు విజయ గానంతో ప్రారంభమైన ఈ సభలో ప్రధాన కార్యకర్త కొండముది ప్రేమకుమార్ స్వాగత వచనాలు అందించారు. సభాధ్యక్షులు విశ్వజననీ పరిషత్ ట్రస్టు అధ్యక్షులు మన్నమూరు నరసింహమూర్తి తొలి పలుకులు పలికారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ జిల్లెళ్ళమూడితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అమ్మ చూపిన మార్గమే సామాజిక అభ్యుదయానికి రాచబాట అన్నారు. అమ్మ శత జయంతి వేడుకలు వైభవంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రధాన వక్త డాక్టరు నందనవనం శ్రీనివాసరావు అమ్మ అపార వాత్సల్య వైభవాన్ని కీర్తించారు. అమ్మ నడయాడిన ఈ బాపట్ల గడ్డ అత్యంత పునీతమైందని, సామాజిక, ఆధ్యాత్మిక రంగాలలో అమ్మచూపిన వెలుగుబాట సాటిలేనిదని పేర్కొన్నారు. అమ్మ అన్న యజ్ఞం మహోన్నతమైందని చెప్పారు. అమ్మతో చిరకాలంగా బంధం పెనవేసుకున్న సోదరులకు విశేష సత్కారం చేశారు. సభానంతరం అందరికీ అమ్మ ప్రసాద వితరణ జరిగింది.

అక్రమ మద్యం అమ్ముతున్న ఇద్దరిపై కేసు

- 71 మద్యం బాటిళ్ళు, కారు స్వాధీనం
- ఏఈఎస్ నరశింహారావు



ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు, కారు

బాపట్లటౌన్: ఎస్ఈబీ అధికారులు ఆదివారం ఇద్దరిపై కేసు నమోదు చేశారు. నిందితుల వివరాలను ఎస్ఈబీ ఏఈఎస్ జి.నరశింహారావు ఆదివారం సెబ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. పిట్టలవానిపాలెం మండలం మంతెనవారిపాలెం గ్రామానికి చెందిన సూరే వెంకటేశ్వరరావు గ్రామంలో హోటల్ నిర్వహిస్తుంటాడు. హోటల్ ముసుగులో పుదుచ్చేరికి చెందిన మద్యాన్ని యథేచ్ఛగా విక్రయిస్తున్నాడు. వెంకటేశ్వరరావు నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను విక్రయిస్తున్నట్లు సమాచారం తెలుసుకున్న సెబ్ అధికారులు పక్కా ప్లాన్‌తో అదుపులోకి తీసుకున్నారు. వెంకటేశ్వరరావుకు మద్యం సరఫరా చేస్తున్న చెరుకుపల్లి మండలం రాంబోట్లపాలెం గ్రామానికి చెందిన జూపూడి బేబిశ్వరరావుపై కేసు నమోదుచేశారు. వీరి వద్ద నుంచి 71 మద్యం బాటిళ్లు, కారును స్వాధీనం చేసుకున్నారు. మద్యం వ్యాపారం చేసినా, ఇతర రాష్ట్రాల్లోని బాటిళ్లను మన రాష్ట్రంలో విక్రయిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండిపడేలా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో ఎస్ఈబీ సీఐ ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు నవోదయ విద్యార్థులు

చిలకలూరిపేటటౌన్: దేశవ్యాప్తంగా జవహర్ నవోదయ విద్యాలయాల్లో 12వ తరగతి చదివే విద్యార్థులకు నిర్వహించే ఉచిత శిక్షణ ప్రవేశ పరీక్షల్లో మండలంలోని జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థులు ఎంపికవ్వడం హర్షణీయమని విద్యాలయ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు చెప్పారు. ఆదివారం మండలంలోని మద్దిరాల గ్రామంలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ దక్షిణ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నీట్ (మెడికల్) జేఈఈ (ఐఐటీ) కోర్సుల్లో ఉచిత శిక్షణ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తుందని చెప్పారు. ఈ పరీక్షల్లో విద్యాలయానికి చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. జి.ప్రవీణ్‌కుమార్, ఎం.కార్తీక్‌లు ఇంజినీరింగ్‌లో, కె.మనోజ్‌నాయక్, ఎ.వీరాంజనేయులు నాయక్ మెడికల్ కోర్సులకు ఎంపికయ్యారు. దేశ వ్యాప్తంగా 621 నవోదయ విద్యాలయల్లోని విద్యార్థులు హాజరయ్యారు. ఎంపికైన ప్రతి విద్యార్థికి రూ. 2 లక్షలు దక్షిణ ఫౌండేషన్ చెల్లించి, నాలుగు సంవత్సరాల పాటు ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.